## క్లుప్తంగా

### చిన్నారి వైద్యానికి వితరణ


అనారోగ్యానికి గురైన చిన్నారి

సామర్లకోట: స్థానిక భీమవరం పేటకు చెందిన మిరియాల ప్రతాప్ (మాజీ వలంటీర్) మూడేళ్ల కుమారుడు అనారోగ్యంలో చైన్నైలో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని వాట్సప్ ద్వారా తెలుసుకున్న స్థానిక ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తన వంతు సాయంగా రూ.5 వేలు ప్రతాప్‌కు అందజేశారు. బ్లెడ్ క్యాన్సర్‌తో బాధ పడున్న చిన్నారి వైద్యానికి రూ.10 లక్షలు ఖర్చవుతుందని చెప్పడంతో ఇంటిని అమ్మగా వచ్చిన రూ.2 లక్షలు ఆస్పత్రిలో చెల్లించినట్టు తెలిపారు. వైద్యం నిమిత్తం చైన్నైలో సుమారు 8 నెలలు ఉండాలని చెప్పడంతో ఎవరైనా ఆర్థిక సాయం చేస్తారేమోననే ఆశతో తన స్నేహితుల ద్వారా వాట్సప్ సందేశాలు పంపినట్టు ప్రతాప్ తెలిపారు.

### వచ్చే నెల 2న ఉచిత కంటి వైద్య శిబిరం

సామర్లకోట: మండల పరిధిలో హుస్సేన్‌పురం గ్రామంలో మార్చి 2వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామ నాయకుడు చల్లా బుజ్జి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ కిరణ్ కంటి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేస్తారన్నారు. 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హుస్సేన్‌పురం గ్రామ పరిధిలోని అన్ని గ్రామాల వారికి వైద్య పరీక్షలు చేయనున్నట్టు తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పంచాయతీ సమీపంలో ఉన్న ఎలిమెంటరీ పాఠశాలలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

### విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కొత్తపల్లి: కొమరగిరి సబ్ స్టేషన్‌లో వార్షిక విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీ డీసీఎల్ పెద్దాపురం డివిజన్ ఈఈ ఏవీఎస్ఎస్ ప్రభాకరావు బుధవారం తెలిపారు. కొమరగిరి, చిన్న కలవలదొడ్డి, పెద్దకలవలదొడ్డి, కుతుకుడుమిల్లి గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వివరించారు. విద్యుత్ వినియోగదారుల సిబ్బందికి సహకరించాలన్నారు.

పిఠాపురం: విద్యుత్ లైన్ల మరమ్మత్తులలో భాగంగా శుక్రవారం పిఠాపురంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 33/11 కేవీ పిఠాపురం సబ్ స్టేషన్ నుంచి వచ్చే 11 కేవీ భీమ్‌గనర్ ఫీడర్‌పై ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. చిట్టిడితోట, మంగాయమ్మరావు పేట, కరివేపాకు పేట, సీతయ్య గారి తోట, విద్యుత్ నగర్, రాజుగారి కోట, మున్సిపల్ ఆఫీస్ ఏరియా, మార్కెట్ ఏరియా, విరవాడ రోడ్, యానాదుల కాలనీ, పాదగయ, కత్తులగూడెం, కాకినాడ రోడ్డు, కొండప్ప వీధి, చిత్రాడ బ్రిడ్జి, పాలిటెక్నిక్ కాలేజ్, జడ్జి క్వార్టర్స్, గవర్నమెంట్ హాస్పిటల్, రూరల్ పోలీస్ స్టేషన్, ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్, సామర్లకోట రోడ్, గురుకుల పాఠశాల, పక్షుల మర్రిచెట్టు, సకలయ్య చెరువు, గాంధీ బొమ్మ సెంటర్, నూకాలమ్మ గుడి వీధి పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### కోడి పందేలపై దాడి

- నలుగురి అరెస్టు
- రెండు కోళ్లు, రూ.9 వేల స్వాధీనం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం కొడవలిలో కోడి పందేల శిబిరంపై బుధవారం దాడి చేసినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు కొడవలి శివారు ప్రాంతంలో కోడి పందాలు ఆడుతున్న శిబిరం దాడి చేసి నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.9050, 2 కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపారు.

### ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

కాకినాడ సిటీ: పశు సంవర్ధకశాఖలో పశు సంచార వాహనాలపై పని చేసే సిబ్బందిని తొలగిస్తున్నట్లు ఆదేశాలు ఇవ్వడం దారుణమని, తక్షణమే ఆదేశాలు వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ, కోశాధికారి మలక వెంకట రమణ ప్రభుత్వాన్ని కోరారు. పశుసంవర్ధశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 1962 వాహనాల నిలిపివేతపై కలెక్టరేట్ వద్ద బుధవారం ఈ మేరకు ధర్నా చేశారు. జిల్లాలో పశు సంచార వాహనాలు 14 ఉన్నాయని, వాటిలో డ్రైవర్లు, ఫార్మసిస్టులు, డాక్టర్లు పని చేస్తున్నారన్నారు. వీరందరిని తొలగిస్తున్నట్లు వారికి వాట్సాప్‌లో మెసేజీలు పంపారని, వాటిని వెంటనే వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వాహనాల సిబ్బందికి బకాయి పడిన రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం జేసీ రాహుల్ మీనాకు వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం జేసీ మాట్లాడుతూ బకాయి వేతనాలు చెల్లింపునకు తక్షణమే ప్రభుత్వంతో మాట్లాడతామని, వీరిని విధుల్లోకి తీసుకునేందుకు ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ మల్లిక, శ్రీను, రమణ, ప్రసాద్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# విశిష్ట సంఖ్యతోనే సంక్షేమం

- ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య
- నకిలీ రైతులు, బినామీలకు అడ్డుకట్ట
- నెలాఖరుకు ప్రక్రియ పూర్తికి చర్యలు


రైతులకు గుర్తింపు సంఖ్యపై పొలం వద్దే అవగాహన కల్పిస్తున్న ఏఓ సంజయ్

పెద్దాపురం: నకిలీల నివారణకు అర్హులకు ప్రభుత్వ పథకాల అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు 11 అంకెల విశిష్ట సంఖ్య జారీ చేయనున్నారు. రైతుకు నేరుగా లబ్ధి చేకూర్చేందుకు ఫార్మర్ రిజిస్టర్ పేరుతో వారి వివరాలన్నీ రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేస్తున్నారు. తరువాత కౌలు రైతులకు కూడా ఈ తరహా నంబర్ జారీ చేయనున్నారు. 11 నెలల కాల పరిమితితో ఈ నెంబర్ కేటాయిస్తామని అధికారులు చెబుతున్నారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో ప్రతి రైతు వ్యక్తిగత భూ వివరాలు నమోదు చేసి, ఆధార్ సంఖ్య మాదిరిగా ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తున్నారు. ఈ సంఖ్య ఉన్న వారికి పంటల బీమా, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ వ్యవసాయ పరికరాలపై రాయితీలు, పంట నష్ట పరిహారం వంటివి అందజేస్తారు. సాగు నీటి సంఘాల సమస్యలు, పంట తెగుళ్ల ఇతర వ్యవసాయ సందేహాలు సైతం అధికారుల నుంచి నేరుగా పొందే అవకాశం ఉంటుంది. నియోజకవర్గంలో పెద్దాపురం మండలంలో 22 వేల మంది, సామర్లకోట మండలంలో 26 వేల మంది కౌలు రైతులు ఉన్నారు.

**మొరాయిస్తున్న సర్వర్లు..**

ఒకేసారి అన్ని రైతు సేవా కేంద్రాల్లో విశిష్ట సంఖ్య కోసం నమోదు కార్యక్రమం చేపట్టడంతో సర్వర్లు మొరాయిస్తున్నాయి. ఆన్‌లైన్ ప్రక్రియలో భాగంగా రైతులకు ఓటీపీలు కూడా రావడం లేదు. రైతులు ఆర్‌బీకేల వద్ద వేచి చూడాల్సి వస్తుంది. వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతు అర్హుడే. రైతు ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ అనుసంధానమై ఉండాలి. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్ ఆధార్ లింక్ అయిన ఫోన్ తీసుకుని రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలి. ఈ ఆధారాలతో రైతు వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తారు. నమోదు పూర్తికాగానే రైతు ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఆ నెంబర్ ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తే నమోదు ప్రక్రియ పూర్తి అవుతుంది. అయితే కొందరు రైతులు తమ ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం కాకపోవడంతో నమోదు ప్రక్రియకు అంతరాయం ఏర్పడుతోంది. ఇక్కడ వరి పంట పొలాలుండి ఇతర రాష్ట్రాల్లో ఉండే రైతులు తమ ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింక్ చేయించుకోకపోవడం, సెల్‌ఫోన్లు పోగట్టుకున్న రైతుల నమోదు ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

### సాంకేతిక లోపాలు తలెత్తకుండా చూడాలి



రైతుల 11 అంకెల సంఖ్య గుర్తింపు ప్రక్రియలో సాంకేతిక లోపాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. సర్వర్ పని చెయ్యడం లేదంటూ రైతులను ఆర్‌బీకేల చుట్టూ తిప్పుతున్నారు. రైతు వ్యవసాయ పనులు మానుకుని రైతు సేవా కేంద్రం వద్ద ఉండాలంటే ఇబ్బంది తప్పడం లేదు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సర్వర్ ఇబ్బందులు లేకుండా చూడాలి.

–నల్లల గోవిందు, రైతు, కట్టమూరు, పెద్దాపురం మండలం

### చురుగ్గా ప్రక్రియ



ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య ఇచ్చే ప్రక్రియ చేరుకుగా సాగుతోంది. ప్రతి మండలంలో ఐదు వేలకు పైగా ఉన్న రైతులకు ఈ విశిష్ట సంఖ్య ఇస్తాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నెలాఖరులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం.

– కె.సంజయ్‌కుమార్, ఎంఏఓ, పెద్దాపురం

### సారా బట్టీలపై పోలీసుల దాడి

వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం


రమణక్కపేటలో సారా బట్టీ, బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్సై వెంకటేష్

కొత్తపల్లి: మండలంలోని రమణక్కపేట శివారు కొత్త మూలపేట తోటలో సారా తయారు చేస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై వెంకటేష్ బుధవారం సిబ్బందితో సారా బట్టీపై దాడులు చేశారు. సారా తయారీకి ఉపయోగించే సుమారు వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి ఉపయోగించే సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సారా తయారు చేస్తున్న అనుసూరి శ్రీనును అరెస్టు చేసి, 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని తనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి

పిఠాపురం: జర్నలిస్టులపై దాడులను అరికట్టి, వారికి రక్షణ కల్పించాలని నియోజకవర్గ జర్నలిస్టులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేసి డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రరెడ్డి కి వినతిపత్రం అందజేశారు. పార్వతీపురం మన్యం మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి రామారావుపై ఆ మండల టిడిపి అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు దాడి చేయడం, బెదిరించడం దారుణమన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు కోరారు.

# చెరువులను రక్షించండి

- రద్దుమట్టితో పూడ్చి యథేచ్ఛగా ఆక్రమణలు
- కలెక్టర్‌కు మేడపాడు నాయకుల వినతి


చెరువులను రక్షించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మేడపాడు గ్రామస్తులు

సామర్లకోట: మండల పరిధిలో జి.మేడపాడు గ్రామంలో పంచాయతీ చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని పరిరక్షించాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మోరంపూడి శ్రీరంగనాయకులు బుధవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలికి వినతి పత్రం అందజేశారు. బుధవారం స్థానిక పంచారామ క్షేత్రానికి వచ్చిన ఆయనకు గ్రామంలో చెరువుల పరిస్థితిని వివరించారు. ఇళ్లు కూల్చగా వచ్చిన రద్దు మట్టిని పంచాయతీ ఆధ్వర్యంలో ఉన్న చెరువులలో వేసి పూడుస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల మత్స్యకారులు జీవనోపాధి కోల్పోవడంతో పాటు పంచాయతీ ఆదాయం కోల్పోతోందని మత్స్యకార సంఘ నాయకులు వేమగిరి ఏసు, దూళ్ల సత్తిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో అన్ని చెరువులు పూడ్చి వేయడంతో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం గ్రామంలోని చింతల చెరువు పూడ్చివేత పనులు జరుగుతున్నాయని, ప్రస్తుతం చెరువులను పూడ్చి వేసి ఆక్రమణలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి చెరువులను రక్షించాలన్నారు.

# మహా శివరాత్రికి పటిష్ట ఏర్పాట్లు

- వీఐపీలు నిబంధనలు పాటించాలి
- లేకుంటే కేసులు తప్పవు
- జిల్లా కలెక్టర్ షణ్మోహన్


పాదగయ క్షేత్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

పిఠాపురం: ఈ నెల 24 నుంచి నిర్వహించనున్న మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పిఠాపురం కుక్కుటేశ్వర స్వామి దేవస్థానానికి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఈ మేరకు స్థానిక పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వర దేవస్థానాన్ని సందర్శించి స్నాన ఘట్టం, దర్శన మార్గాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, భోజన ఏర్పాట్లు, బందోబస్తు, విద్యుత్ సరఫరా, వైద్య శిబిరాల ఏర్పాటు, సాధారణ ప్రజలు, వీఐపీల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, బారికేడ్ల ఏర్పాటు, భక్తుల రద్దీ నియంత్రణకు క్యూలైన్ల వంటి ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవదాయ, ధర్మదాయ శాఖ, రెవెన్యూ పోలీస్, రోడ్లు, భవనాలు, ఇరిగేషన్, పురపాలక, మత్స్య, వైద్య ఆరోగ్యం తదితర శాఖల అధికారులతో కలిసి ఆలయ ప్రదేశాలను పరిశీలించి, ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో సామర్లకోట, పిఠాపురంలో ఉన్న ప్రసిద్ధి క్షేత్రమైన కుక్కుటేశ్వర స్వామి దేవస్థానంకు మహాశివరాత్రి సందర్భంగా వచ్చే ప్రజానీకానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. కొద్దిరోజులుగా వివిధ రాష్ట్రాల్లో జరిగిన సంఘటనల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. దేవాలయాల దగ్గరున్న స్నాన ఘట్టాలు, ఇతర ప్రదేశాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో భక్తులకు అవసరమైన తాగునీరు, చలువ పందిళ్ల ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల రద్దీ వల్ల ఎటువంటి తొక్కిసలాట జరగకుండా అవసరమైన క్యూలైన్లు, బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఆలయాల్లో ఎటువంటి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఘటనలు చోటు చేసుకోకుండా ఏపీ ఈపీ డీసీఎల్ అధికారులు ముందుగానే ఆలయాలను పరిశీలించి అధిక విద్యుత్ లోడ్ పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆలయాల వద్ద అగ్నిమాపక శాఖ ఫైర్ ఇంజిన్లు అందుబాటులో పెట్టుకోవాలన్నారు. మున్సిపాలిటీ అధికారులు తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ రద్దీ నియంత్రణతో పాటు, పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేపట్టాలన్నారు. ప్రధానంగా జిల్లాలో ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయడం లేదన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు భక్తులు, వీఐపీలు, ప్రజలు నిబంధనలు పాటించి సంయమనంతో వ్యవహరించాలన్నారు. నిబంధనలు మీరితే తగిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఆయన వెంట కాకినాడ ఏఎస్పీ మనిష్ పాటిల్ దేవరాజ్, దేవదాయ శాఖ డీసీ డీఎల్వీ రమేష్ బాబు, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, మత్స్య శాఖ అధికారి కె.కరుణాకర్ బాబు, రోడ్లు భవనాల శాఖ ఈఈ టీ రమేష్ కుమార్, పిఠాపురం కుక్కుటేశ్వర స్వామి దేవస్థానం ఈవో జగన్మోహన్ శ్రీనివాస రావు, సీఐ జి.శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వైద్య ఆరోగ్యం, విద్యుత్, పోలీస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనాలి


విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ, హెచ్ఎం

ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: పదో పరీక్షలను పండగ వాతావరణంలో రాసేలా విద్యార్థులు సిద్ధపడాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన సందర్శించారు. ఇటీవల పూర్తి చేసుకున్న ప్రీ ఫైనల్ పరీక్షల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి నుంచి సెల్ ఫోన్, టీవీలు, ఆటలకు దూరంగా ఉండి పుస్తకాలపై శ్రద్ధ చూపాలని పిలుపు నిచ్చారు. హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ మాట్లాడుతూ ప్రీ ఫైనల్ పరీక్షలతో విద్యార్థులకు ఆత్మ విశ్వాసం పెరిగిందన్నారు. ఈ పరీక్షలలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి మరింత శ్రద్ధ చూపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పదో తరగతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కోళ్ల ఫారాల దగ్గర ఆంక్షలు అమలు చేయాలి

జిల్లా కలెక్టర్ షణ్మోహన్

పిఠాపురం: పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో కోళ్ల మరణాలకు సంబంధించి ఇంకా వ్యాధి నిర్ధారణ కాలేదని, ఈ లోపు విధించిన ఆంక్షలు అమలులోకి తీసుకురావాలని కలెక్టర్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో కోళ్ల మృతిపై వాస్తవాలు నిర్ధారించడానికి పశుసంవర్ధక శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి నమూనాలు సేకరించారన్నారు. ఘటన ప్రదేశంలో తక్షణ రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పొలంలో ఇతర జంతువులు, పక్షులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ సిబ్బంది ఇతర వ్యక్తులు ఆయా ప్రాంతాల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనుమానిత పొలాల్లో పని చేసే వారు మరే ఇతర పౌల్ట్రీ ఫారం, పక్షుల అభయారణ్యం, జూ తదితర వాటిలోకి వెళ్ల కుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుమానిత ప్రాంతాల్లో ప్రవేశ ద్వారాల వద్ద కచ్చితంగా క్రిమి సంహారక చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా పొలం వద్ద ఉన్న పక్షులకు సంబంధించిన అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు.

### సర్వే సకాలంలో పూర్తిచేయాలి

కరప: ఇంటింట సర్వే సకాలంలో పూర్తిచేయాలని మండల ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో బుధవారం మండల కార్యదర్శుల సమావేశంలో వివిధ అంశాలపై సమీక్షించి, అనుసరించాల్సిన విధివిధానాలపై సూచనలు ఇచ్చారు. డ్రోన్ల ఆధారంగా నిర్వహించిన సర్వే మ్యాప్ ఆధారంగా ఆయా ఇంటి యజమానులకు సరిహద్దులను నిర్ణయించి, ఏమైనా అభ్యంతరాలుంటే తీసుకుని, సర్వే పూర్తి చేసి, ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్లు ముమ్మరం చేసి, నూరు శాతం వసూళ్లు పూర్తిచేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలన్నారు. వేసవిలో అన్ని ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఈఓ పీఆర్డీ సూచించారు.

### భావనారాయణుని ఆలయ ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ


ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఈవో లక్ష్మీనారాయణ

కాకినాడ రూరల్: స్థానిక సర్పవరం భావనారాయణ స్వామి దేవస్థానం ప్రహరీ గోడను పునర్నిర్మించనున్నట్టు ఆలయ ఈవో లక్ష్మీ నారాయణ బుధవారం విలేకర్లకు తెలిపారు. ఏడేళ్ల క్రితం అధిక వర్షాల వల్ల పురాతనమైన ఈ గోడ కూలి పోయింది. అప్పటి నుంచి పురావస్తు శాఖ పలు మార్లు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నేటి వరకు ఎటువంటి పురోగతి కనిపించలేదు. దేవస్థానం అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని భక్తులు, గ్రామస్తుల మనోభావాలకు అనుగుణంగా దేవస్థానం నిధులతో ఈ గోడను పునర్నిర్మించేందుకు పురావస్తు శాఖకు నివేదికలు పంపగా గోడల మధ్యలో కాంక్రీట్ రాయి వేసి కరక్కాయ, గానుగ సున్నంతో దీనిని నిర్మించేందుక వారు అనుమతించారు. దేవస్థానం నిధులతో ఈ చర్యలు చేపడుతున్నారు. బుధవారం దేవస్థానం సిబ్బంది, అర్చకులు గ్రామస్తులు, భక్తులు, పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, వారి సిబ్బంది సమక్షంలో దేవస్థానం నిధులతో ఈ నిర్మాణ పనులు ప్రారంభించినట్టు చెప్పారు.

# శివాజీ మహారాజ్‌కు ఘనంగా నివాళి



శివాజీ చిత్రపటానికి నివాళులు అర్పించిన వీహెచ్‌పీ నాయకులు

సామర్లకోట: చత్రపతి శివాజీ జయంతిని పట్టణంలో బుధవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. స్థానిక ప్రసన్నాంజనేయ ఆలయం వద్ద శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దేశ చరిత్రలో హిందూ సామ్రాజ్య స్థాపనకు కృషి చేసి సుస్థిర పాలన అందించారని వీహెచ్‌పీ నియోజకవర్గ నాయకుడు పెన్నాడ జగన్నాథం అన్నారు. దేశ సంస్కృతిని కాపాడటంలో తన ప్రాణాలను సైతం అర్పించారని పేర్కొన్నారు. ఈ మేరకు భారీ చిత్రపటంతో హనుమాన్ శోభాయాత్ర కమిటీ, ధర్మవీర్ సాంబాజీ మహారాజ్ యువసేన ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా కమిటీల నాయకులు కాటంరెడ్డి ఏడుకొండలు, కిమిలి దుర్గాప్రసాద్‌రెడ్డి, ఊలపల్లి సత్తిరాజు, వీర ప్రకాష్, యేలేటి రమేష్, పోతుల వీరప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ విడుదల చేయాలి



జేసీ రాహుల్ మీనాకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేసిన మెగా డీఎస్సీ హామీ ఇచ్చి ఎనిమిది నెలలైందని, తక్షణం ఆ మేరకు నోటిఫికేషన్ విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకులు సీహెచ్ గీత, వై.బాబి బుధవారం కలెక్టరేట్‌లో జేసీ రాహుల్ మీనాకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీపై తొలి సంతకం చేసిన సీఎం, ఆ విషయమే మరిచిపోయినట్లు ఉన్నారని విమర్శించారు. నోటిఫికేషన్ లేక లక్షలాది మంది నిరుద్యోగులు రూ.లక్షలు ఖర్చు పెట్టి కోచింగ్ తీసుకుని నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు అండగా కలెక్టర్లకు, ప్రభుత్వ అధికారులకు వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. పలు జిల్లాలో పోస్టుల ఎంపికపై అన్యాయం జరుగుతోందని, అభ్యర్థులకు న్యాయం జరిగేలా అన్ని జిల్లాల మాదిరిగా పోస్టులు పంచాలని వినతి పత్రంలో కోరినట్లు బాబీ, గీత తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు వి.లోవ, ఎం.వీరబాబు, మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

### త్రేతాయుగ ప్రతీక భద్రాచల పాదయాత్ర

బోట్‌క్లబ్: త్రేతాయుగంలో శ్రీరాముని 14 ఏళ్ల వనవాసంలో పాదయాత్ర చేసి ద్వాపర యుగంలో శ్రీకృష్ణునిగా భాగ్యం పొందారని గురుస్వామి వాసుదేవ ఆచార్య అన్నారు. గత 14 ఏళ్ల నుంచి భద్రచలానికి పాదయాత్ర చేస్తున్న గురుస్వామి వాసుదేవ ఆచార్యను బుధవారం స్థానిక భోగి గణపతి పీఠంలో సత్కరించారు. ద్వాపరయుగంలో పాండవుల వనవాస పాదయాత్రతో ధర్మం నిలిచిందని, కలియుగంలో ఆది జగద్గురువులు చేసిన పాదయాత్రలను అనుసరించడం వల్ల మూడు తరాలు ప్రారబ్ధ కర్మల పరిహారం కలుగుతుందన్నారు. అనంతరం భోగి గణపతి పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు ఆయనను పట్టువస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గిడుతూరి వీరభద్రరావు, గళ్లా సుబ్బారావు పాల్గొన్నారు.

# ఘనంగా ముసాలమ్మ తీర్థం


ముసాలమ్మ తల్లిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ కన్నబాబు

కరప: మండలంలోని వేములవాడ గ్రామ దేవత ముసాలమ్మ తీర్థాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి శివారున రాయిచెట్టు వద్ద ఉండే ముసాలమ్మను మూడునెలల ముందుగా గ్రామంలోనికి తీసుకు వచ్చి తాటాకుల పాక (అంగణిగుడి) వేసి నిలుపుతారు. మూడు రోజుల పాటు గ్రామోత్సవం జరిపి, అమ్మవారిని గ్రామంలో ఊరేగిస్తూ చివరి రోజున ముసాలమ్మకు మొక్కులు తీర్చుకుని తీర్థం నిర్వహిస్తారు. ఆ రోజున అమ్మవారిని రాయిచెట్టువద్ద అమ్మవారి గుడికి తీసుకెళతారు. ఈ యేడాది గ్రామస్తులు బంధువులను, స్నేహితులను, ఇంటి ఆడపడచులను, అల్లుళ్లను పిలుచుకుని అమ్మవారి తీర్థాన్ని ఘనంగా జరుపుకున్నారు. కరప డీసీ చైర్మన్ పుణ్యమంతుల సత్యనారాయణ (పీజీ), ఆలయ కమిటీ సభ్యులు జాతర, తీర్థం ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, సర్పంచ్ కమిడి మంగాదేవి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీటీసీ అనసూరి శ్రీనివాసరావు, వివిధ పార్టీల నాయకులు, వేములవాడ గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

**వలసపాకలలో**

మండలం వలసపాకల గ్రామదేవత ముసాలమ్మ తీర్థం సైతం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందురోజు రాత్రి అమ్మవారికి జాతర నిర్వహించారు. తీర్థంరోజున గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ వాసంశెట్టి రామారావు, వివిధ పార్టీల నాయకులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.